సాక్షి తిరుపతి

బుధవారం । 7 । జూన్ । 2023



చల్లంగా చూడు గంగమ్మతల్లీ

చల్లంగా చూడు గంగమ్మ తల్లీ.. అంటూ భక్తలు మంగళవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. - IIలో



మహిళలకు మెరుగైన జీవనం

స్వయం ఉపాధితో మహిళలు మెరుగైన జీవనో పాధిని పొందవచ్చని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. - IIలో



	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	28
చిత్తూరు	39	27
తిరుమల	36	23
గూడూరు	43	30
నగరి	42	29

న్యూస్‌రీల్

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు: మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఇంగ్లిషు మీడియంలో చదివే విద్యార్థులే అర్హులని పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తులు సత్యవేడు గురుకుల పాఠశాలలో అందజేయాలి. 20 తేదీ ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయనున్నట్టు వెల్లడించారు. వివరాలకు 986613602లో సంప్రదించాలని ఆయన సూచించారు.

9న మెగా జాబ్‌మేళా

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, సీఈఈడీఏపీ, కళాశాలలోని జేకేసీ వారి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ మంగళవారం తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాను స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతులు మీదుగా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. నియోజకవర్గంలో సుమారు 17 బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ఈ జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు తెలిపారు. పది నుంచి పీజీ దాకా చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్‌కార్డు, బయోడేటా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు మూడు తీసుకురావాలని సూచించారు. వివరాలకు కళాశాలలోని జేకేసీ కో–ఆర్డినేటర్ ప్లేస్‌మెంట్‌సెల్ ఆఫీసర్ ఎం యలమందరావు, మొబైల్ నంబర్ 94412 30384లో సంప్రదించాలని కోరారు.


కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ



అక్రిడిటేషన్లు అందజేస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం జారీచేశారు. జిల్లాలో తొలి విడతలో 513 అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. అయితే ఇందులో 500 కార్డులను జారీ చేయగా.. మిగిలిన కార్డులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త కార్డులు 2024 డిసెంబర్ 31వ తేదీ వరకు వర్తించనున్నాయి. ఆ మేరకు ఆర్టీసీ బస్సు పాస్‌లను బుధవారం నుంచి జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. బస్సు పాస్ కోసం దరఖాస్తు చేసుకునే జర్నలిస్టులు కొత్త అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్‌తోపాటు పాత బస్సు పాస్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ ఫొటోను అందజేయాల్సి ఉందని ఆర్టీసీ అధికారులు చెప్పారు.

ఉపాధి కూలీల హాజరు శాతం పెంచాలి



సమీక్షలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు శాతం పెంచాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి ద్వారా పీడీ శ్రీనివాసప్రసాద్‌తో కలిసి ఎంపీడీవోలు సహాయ పథక సంచాలకులు, సహాయ ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. సరాసరి కూలి ప్రస్తుతం రూ.260 ఉందని, దాన్ని రూ.272కు తగ్గకుండా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ఆ దిశగా ఎంపీడీవోలు పురోగతి చూపాలని వెల్లడించారు. చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, తడ, పాకాల, చిట్టమూరు, పెళ్లకూరు, బీఎన్‌కండ్రిగ, వాకాడు మండలాలు ఉపాధి హామీ, హార్టికల్చర్ పురోగతిలో తక్కువగా ఉందన్నారు. ఆధార్‌కు అనుసంధానం కాకుండా పెండింగ్‌లో ఉన్న 6,695 జాబ్ కార్డులను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు.

ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి

తిరుపతి అర్బన్: జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయిల ద్వారా నీరు అందించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించే కార్యక్రమం 96శాతం పూర్తిచేశారని, దీన్ని వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ద్వారా సంపద సృష్టిస్తున్నట్టు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖరరెడ్డి, జిల్లా గ్రామీ ణ నీటిపారుదల ఇంజినీర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో..

పేదలపై పెత్తనం



ప్రభుత్వ భూముల్లో పెత్తందారులు పెత్తనం చెలాయిస్తున్నారు. అసైన్డ్ పట్టాలిచ్చారంటూ స్థానికులు, అధికారులను నమ్మించి దర్జాగా అనుభవిస్తున్నారు. పక్కనే ఉన్న మిగులు భూముల్లో దళితులు ఆటస్థలం కోసం చదును చేసుకుంటే వారిపై దౌర్జన్యానికి దిగారు. వెంకటగిరి నియోజకవర్గం, బాలాయపల్లి మండల పరిధిలోని రామాపురంలో వెలుగుచూసిన టీడీపీ నేతల ఆక్రమణ పర్వంపై 'సాక్షి' ఫోకస్..

- నిమ్మతోటలు సాగుచేసుకుంటున్న వైనం
- అసైన్డ్ భూపట్టాలిచ్చారంటూ నమ్మిస్తున్న స్థానికులు
- పదేళ్లుగా అనుభవిస్తున్నా వారి జోలికెళ్లని అధికారులు
- దళితులు.. గిరిజనుల ఆట స్థలం కోసం చదునుచేస్తే దౌర్జన్యం
- బాలాయపల్లిలో వెలుగుచూసిన టీడీపీ నేతల ఆక్రమణల పర్వం

సాక్షి, తిరుపతి: రామాపురం పరిధిలో సర్వే నంబర్ 177లో 348.98 ఎకరాల మేతపోరంబోకు భూమి ఉంది. అదేవిధంగా సర్వే నంబర్ 189లో 37.7 ఎకరాల చెరువు పోరంబోకు, సర్వే నంబర్ 178/1, 179, 180లో ప్రభుత్వ, చెరువు పోరంబోకు భూమి ఉంది. కోట్ల రూపాయల విలువచేసే ఈ భూములపై టీడీపీ నేతల కన్నుపడింది. రామాపురం మారుమూల గ్రామం కావడంతో అప్పట్లో అధికారుల రాకపోకలు పెద్దగా ఉండేవి కావు. ఇదే అదునుగా టీడీపీ నేతలు కొద్దికొద్దిగా ఆక్రమించుకోవడం ప్రారంభించారు. చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారు అదే గ్రామ పరిధిలోని దళిత, గిరిజనులు ఆ భూములవైపు వెళ్లకుండా అడ్డుకుంటూ వచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో భూ పంపిణీ పథకం కింద స్థానిక దళిత, గిరిజనులను జాబితాలో చేర్చినట్లు సమాచారం. అయితే పెత్తందారులు వారి పేర్లను తొలగించినట్లు స్థానికులు ఆరోపించారు.

పెత్తందార్లను ఎదిరిస్తే సాంఘిక బహిష్కరణే!



ఆక్రమించిన భూముల్లో నిమ్మసాగు



పెత్తందారులంతా ఏకమై రామాపురం పరిధిలో ఉన్న ప్రభుత్వ, చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎవరెవరు ఎంతెంత ఆక్రమించుకోవాలో మాట్లాడుకున్నారు. పేరు, పలుకుబడి ఉన్న వారు ఆరు ఎకరాల చొప్పున ఆక్రమించుకుంటే.. వారితో ఉన్న మరి కొందరు 1, 2, 3 ఎకరాల చొప్పున ఆక్రమించుకున్నారు. ఆక్రమించుకున్న భూమిలో నిమ్మచెట్లు సాగుచేశారు. పదేళ్ల క్రితం పెట్టిన చెట్లు కావడంతో ప్రస్తుతం పెద్దవయ్యాయి. అక్రమణదారులకు స్థానిక అధికారులు పూర్తిసహాయ సహకారాలు అందిస్తున్నట్టు దళిత, గిరిజనులు ఆరోపిస్తున్నారు. వారిని కాదని ఎదురు తిరిగితే సాంఘిక బహిష్కరణకు గురికాక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆట స్థలం ఏర్పాటు చేసుకుంటే దౌర్జన్యం

స్థానిక యువకులు కొందరు బీడుగా ఉన్న ప్రభుత్వ భూమి రెండెకరాల్లో క్రికెట్ ఆడుకునేందుకు ఆటస్థలంగా తీర్చుకున్నారు. జీర్ణించుకోలేని పెత్తందారులు స్థానిక రెవెన్యూ అధికారులను రెచ్చగొట్టి యువకులపైకి పంపారు. ఆటస్థలాన్ని ధ్వంసం చేశారు. అదేవిధంగా దళిత, గిరిజనులు కొందరు బీడుగా ఉన్న భూమిలో నిమ్మచెట్లు పెట్టడంతో.. పెత్తందారులు అధికారుల సహకారంతో ఆ చెట్లను పీకించేశారు. సర్వే నంబర్ 177లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కొందరు ఏకమై ఇటీవల తిరుపతి కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయడం గమనార్హం.



దళిత, గిరిజనులు నాటిన నిమ్మచెట్లను పీకేసిన పెత్తందారులు (ఫైల్)

> **ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు**
>
> అసైన్డ్‌మెంట్ పట్టాలున్న వారు మాత్రం సాగుచేసుకోవచ్చు. మిగిలిన ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే చర్యలు తప్పవు. రామాపురంలోని ప్రభుత్వ భూములపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.
>
> – కిరణ్‌కుమార్, ఆర్డీఓ, గూడూరు డివిజన్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్

తిరుపతి అర్బన్: ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి డీపీటీవో కార్యాలయంలో విద్యుత్ బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లడానికి (టోల్ టూ టోల్ వరకు) 28 నిమిషాల ప్రయాణ సమయం పాటించాలన్నారు. అదేవిధంగా తిరుమల నుంచి తిరుపతికి వచ్చే సమయంలో (టోల్ టూ టోల్ వరకు) 40 నిమిషాల ప్రయాణ సమయం పాటించాలని చెప్పారు. ముందు వెళ్లే వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అధికమించరాదన్నారు. ఘాట్‌రోడ్డులో నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే బస్సులను ఆపాల్సి ఉందని తెలిపారు. 1వ కి.మీ రాయి (శ్రీవారి శిలా రూపం) 12వ టర్నింగ్, 6వ కి.మీ రాయి (సెక్యూరిటీ పోస్ట్) 30వ టర్నింగ్, 8వ కి.మీ రాయి(హరిణి) 38వ టర్నింగ్, 11వ కి.మీ రాయి, 58వ టర్నింగ్, లింక్ రోడ్డులోని 7వ టర్నింగ్ ప్రమాదకరమైన మలుపులుగా గుర్తించామని, ఆ మలుపుల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ జిల్లా పర్సనల్ ఆఫీసర్ పార్థసారథి, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు హెచ్‌సీఎల్ టెక్‌బీలో ఉద్యోగాలతోపాటు డిగ్రీ, పీజీ కోర్సులు చదవడానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. 2021–22లో ఇంటర్మీడియెట్‌లో 60 శాతం మార్కులు, 2022–23లో అయితే 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు.

పార్కింగ్ కష్టాలకు చెక్



సచివాలయ సిబ్బందికి ట్యాబ్‌ను అందజేస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: టీపీ ఏరియాలో నిర్మిస్తున్న మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్‌తో వాహనదారులకు పార్కింగ్ కష్టాలు తీరనున్నాయని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డీ.హరిత తెలిపారు. రైల్వేస్టేషన్ పార్సిల్ కౌంటర్‌కు ఎదురుగా నిర్మించనున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ స్థలాన్ని అధికారులతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, విష్ణునివాసం, గోవిందరాజుల స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు, అయా ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు మల్టీ లెవెల్ పార్కింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రూ.50 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఏడు అంతస్తుల్లో మల్టీ లెవెల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. సెల్లార్లో ద్విచక్ర వాహనాల పార్కింగ్, గ్రౌండ్, 1, 2 అంతస్తులో కమర్షియల్ రెస్టారెంట్లు, 3, 4 అంతస్తులు మల్టీప్లెక్స్ థియేటర్లు 5, 6, 7 అంతస్తులో 240 కార్లు పార్కింగ్ చేసుకునేలా డిజైన్ చేసినట్లు చెప్పారు. ఆరు లిఫ్టుల ద్వారా పై అంతస్తులకు కార్ లిఫ్టింగ్ ఉంటుందన్నారు.

వేగంగా భూ సర్వేకు

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా సమగ్ర రీ సర్వే వేగవంతం చేసేందుకు ట్యాబ్‌లు దోహదపడతాయని కమిషనర్ తెలిపారు. సర్వే కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన ట్యాబ్‌లను సచివాలయ సెక్రటరీలకు అందజేశారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎంఈ చంద్రశేఖర్, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం, ఆర్వో సేతుమాధవ్ పాల్గొన్నారు.

నేడు సంకటహర చతుర్థి వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 , సాయంత్రం 5 గంటలకు రెండు పర్యాయాలుగా వ్రతాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు రూ.350 చెల్లించి టికెట్ తీసుకుని వ్రతంలో పాల్గొనవచ్చని సూచించారు. రాత్రి స్వామివారు స్వర్ణరథంపై ఊరేగనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టినట్టు వివరించారు.

జైశ్రీరామ్



వేదికపై చిత్ర యూనిట్



రామబాణం



సినీబృందంతో ముఖ్య అతిథులు చిన్నజీయర్ స్వామి, వైవీ సుబ్బారెడ్డి



ప్రభాస్‌తో చెవిరెడ్డి తనయులు

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి వెంకన్న పాదాల చెంత జైశ్రీరామ్..జైశ్రీరామ్ నినాదం మార్మోగింది. మంగళవారం ఎస్వీయూ తారకరామా స్టేడియంలో పాన్‌ఇండియా చిత్రం ఆదిపురుష్ సినిమా ప్రీరిలీజ్ ఫంక్షన్ అట్టహాసంగా సాగింది. తిరుపతిలో జరిగిన ప్రీరిలీజ్ వేడుకకు ఆ చిత్ర యూనిట్‌తో పాటు హీరో ప్రభాస్, హీరోయిన్ కృతిసనన్, ఇతర నటీ నటులతోపాటు ప్రత్యేక అతిథిగా చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. హీరో ప్రభాస్ స్టేడియానికి చేరుకోగానే అభిమానులు జైశ్రీరామ్.. జైశ్రీరామ్ నినాదాలు మిన్నంటించారు. సింగర్స్, డ్యాన్సర్లు అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.



కళాప్రదర్శన



వ్యవసాయ విద్యలో సమూల మార్పులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రానున్న రోజుల్లో వ్యవసాయ విద్యలో సమూల మార్పులు తీసుకురానున్నట్లు భారత వ్యవసాయ పరిశోధన మండలి అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీమజగ్గి తెలిపారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల పీజీ విద్యార్థుల ఆధ్వర్యంలో రెండు రోజులుగా వ్యవసాయ పరిశోధన–పోషకాహార భద్రత అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ తరహా సదస్సులను జాతీయ స్థాయిలో అన్ని విశ్వ విద్యాలయాల్లో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో పరిశోధన పట్ల అవగాహనతో పాటు వివిధ రాష్ట్ర విద్యార్థులతో పరస్పర విజ్ఞాన మార్పిడికి, సమాచార మార్పిడికి, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి సదస్సులు దోహదపడుతాయన్నారు. వ్యవసాయ విద్యకు సంబంధించి రానున్న రోజుల్లో సిలబస్, బోధన, ఇతర అంశాలలో అనేక మార్పులు తీసుకురానున్నట్లు ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్దన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ వర్సిటీ ఆధ్వర్యంలో పీజీ దశలో పరిశోధనల నాణ్యతను పెంపొందించేందుకు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ పీజీ డీన్ డాక్టర్ గుత్తా రామారావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సులో దేశం నలుమూలల నుంచి 570 మంది పీజీ విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అనంతరం ఈ సదస్సులో పరిశోధక విద్యార్థులు వివిధ అంశాలపై చర్చాగోష్టులు నిర్వహించారు. ఉత్తమ పరిశోధనాంశాలకు బహుమతులు, ప్రశంసాప్రతాలను అందజేశారు. సదస్సు ముగింపు సమావేశంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సి.రమణ, కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్యగోపాల్ పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న అడిషనల్ డైరెక్టర్, వర్సిటీ వీసీ

ఆధార్ జిరాక్స్‌లు ఇవ్వండి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఆధార్‌కార్డు జిరాక్స్‌లు ఆయా డిపోల్లో ఇవ్వాలని పీవో పార్థసారథి సూచించారు.

క్లుప్తంగా

చెట్టును ఢీకొట్టి ద్విచక్రవాహనదారుడి మృతి


గణేషన్ మృత దేహం

బుచ్చినాయుడుకండ్రిగ: ద్విచక్ర వాహనం అతి వేగంగా కేటీ రోడ్డు పక్కనున్న చెట్టును ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సుద్దమిట్ట గిరిజన కాలనీ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తమిళనాడు రాష్ట్రం, తూత్తుకూడి జిల్లా, కారిసన్‌విలై టౌన్‌కు చెందిన గణేషన్ (40) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి నుంచి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా సుద్దమిట్ట గిరిజన కాలనీ వద్ద కేటీ రోడ్డు పక్కనున్న వేప చెట్టును అతి వేగంగా ఢీకొట్టడంతో గణేషన్ తలకు వేసుకున్న హెల్మెట్ ముక్కలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువులకు ఏఎస్‌ఐ రమేష్‌బాబు సమాచారం అందించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రేషన్ షాపుపై దాడి


దాడులు నిర్వహిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు

సూళ్లూరుపేట: స్థానిక తహసీల్దార్ ఆదేశాల మేరకు సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ కాలనీలోని 36వ నంబర్ షాప్‌పై సోమవారం రాత్రి సివిల్ సప్లయిస్ డీటీ ఓబయ్య, వీఆర్వో దాడులు చేసి అవకతవకలు జరిగినట్టు నిర్ధారించారు. దీంతో డీలర్ ఎం వెంకటరమణయ్యపై 6ఏ కేసు నమోదు చేశారు. షాప్‌లోని రికార్డులు, స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేయగా 5,335 కేజీల బియ్యం, 219 పాకెట్ల చక్కెర తక్కువగా ఉండడంతో వాటిపై ఆరాతీశారు. బియ్యం, చక్కెర లబ్ధిదారులకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌లో అమ్మేసినట్టు వారు భావించి డీలర్‌పై కేసు నమోదు చేశారు. సూళ్లూరుపేట షాప్ నిర్వహిస్తున్న డీలర్‌కు బాపూజీ కాలనీ షాపు కూడా నిర్వహించే బాధ్యతను అప్పగించారు.

చల్లంగా చూడు గంగమ్మతల్లీ


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి


ఆలయానికి పోటెత్తిన భక్తులు


వివిధ వేషధారణలలో రంగస్థలి కళాకారులు

తిరుపతి కల్చరల్: చల్లంగా చూడు గంగమ్మ తల్లీ.. అంటూ భక్తజనం మంగళవారం ప్రత్యేక అలంకరణలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. పలువురు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గంగజాతర తర్వాత వచ్చిన మూడో మంగళవారం కావడంతో అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. గంగమ్మ ఆలయం వద్ద వేకువజాము నుంచే సందడి నెలకొంది. ఉదయం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పండ్లతో గంగమ్మ తల్లిని సర్వాంగసుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో గంగవేషాలు ధరించి ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి మొక్కులు చెల్లించారు. మొక్కుబడిలో భాగంగా రంగస్థలి కళాకారులు వివిధ వేషధారణలో గంగమ్మ ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,920
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,561
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

బీసీ గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

కోట: తిరుపతి జిల్లా పరిధిలోని బీసీ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ నారాయణరావు మంగళవారం తెలిపారు. కోట, దొరవారిసత్రం, గూడూరు, వెంకటగిరి పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయని, తరగతుల వారీగా ఆయా పాఠశాలల్లో తెలియజేస్తారని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

స్వయం ఉపాధితో మహిళలకు మెరుగైన జీవనం


సరదాగా టైలరింగ్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


శిక్షణకు హాజరైన మహిళలు

- లింగేశ్వరనగర్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం
- పాల్గొన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: స్వయం ఉపాధితో మహిళలు మెరుగైన జీవనోపాధిని అందుకోగలరని, ఆర్థికాభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండలం, లింగేశ్వరనగర్ పంచాయతీలో మహర్షి అభ్యుదయ సేవా సంస్థ(మాస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. సరదాగా టైలరింగ్ చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. వెనుకబడిన కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మాస్ సంస్థ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి ఇటువంటి స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళల్లో నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు స్వయం ఉపాధికి ఉపయుక్తమైన టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా ప్రతి పంచాయతీలోనూ మహిళల కోసం ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. మహిళల అభ్యున్నతికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. మూడు నెలల పాటు సాగే ఈ శిక్షణ కార్యక్రమంలో వంద మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తామని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా టైలరింగ్ మిషన్ కూడా అందించనున్నట్లు మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, లింగేశ్వరనగర్, అవిలాల సర్పంచ్‌లు కోటేశ్వరరావు, సీవీ రమణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ సాయిరాయల్, రవి, మహిళలు పాల్గొన్నారు.

ఇసుక కుంటలో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన ముత్యాలయ్య (ఇన్‌సెట్) ముత్యాలయ్య(ఫైల్)

కోట: స్వర్ణముఖి ఇసుకకుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చిట్టమూరు మండలం, మెట్టు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. మృతుడు కోట మండలం, రుద్రవరానికి చెందిన దూడల ముత్యాలయ్య(42)గా గుర్తించారు. చిట్టమూరు ఎస్‌ఐ లక్ష్మీభవానీ కథనం..రుద్రవరానికి చెందిన ముత్యాలయ్య ఇసుక రీచ్ దాటుకుని మెట్టుకు నడిచి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఇసుక కుంటలో ఇరుక్కుని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్రామస్తుల ఆందోళన

మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించకుండా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇసుక రీచ్ కారణంగా ఏర్పడిన కుంటలు ప్రమాదకరంగా మారాయని, తరచూ ప్రమాదాలు చోటు చసుకుంటున్నాయని వాపోయారు. చిట్టమూరు, కోట ఎస్‌ఐలు లక్ష్మీభవానీ, పుల్లారావు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

కారు టైరు పేలి.. చెరువులో పడి..

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు


కారును పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) మృతి చెందిన రమేష్

రామాపురం(అన్నమయ్య జిల్లా) : మండల పరిధిలోని కొండావాండ్లపల్లె సమీపంలో మంగళవారం ముందు టైరు పగలడంతో కారు చెరువులో పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. తిరుపతి పట్టణానికి చెందిన ఏపీఎమ్ఐఎస్‌ఐ డివిజనల్ ఇంజినీర్ రమేష్(58) కారులో అన్నమయ్య జిల్లా రామాపురం మండలం హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెలోని అమర్‌నాథరెడ్డి ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యాడు. తిరిగి కారులో వెళ్తుండగా కొండావాండ్లపల్లె చెరువు కట్ట సమీపంలో టైరు పగిలి కారు బోల్తాపడింది. కారు నడుపుతున్న డి.రమేష్ అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

తిరుపతి అర్బన్: ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు జిల్లా రెవెన్యూ అధికారి కోదండరామిరెడ్డిని కలెక్టరేట్‌లో మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని మార్చుకోవాలని చెప్పారు. పాఠశాల విద్యా వ్యవస్థకు సంబంధించిన జీవో 117ను రద్దు చేయాలని కోరారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని, పదోన్నతులను రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలని చెప్పారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ఎస్ చిరంజీవి(రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్), నాయకులు రమణయ్య, చంగల్రాయలు, తిరుపతి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె.ముత్యాలరెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ యువశ్రీ మురళి, వెంకటముని, కో చైర్మన్ లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

వివాహితపై దాడి

సైదాపురం: ఓ వివాహితపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మంగళవారం కలిచేడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని కలిచేడు గ్రామానికి చెందిన ఎస్ ఈశ్వరమ్మ కుమార్తె మమత కొంతకాలం నుంచి భర్త నుంచి విడిపోయి పుట్టింట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో ఇంటి పక్కనే ఉన్న బొడ మహేష్, మమతపై మనస్సు పడి నిత్యం వేధింపులకు గురి చేస్తుండేవారు. ఈ విషయమై పెద్దలకు చెప్పడంతో మహేష్ వారు మందలించారు. ఈ క్రమంలో మమత ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మహేష్ ఇంట్లోకి వెళ్లి కత్తితో బెదిరించి దాడి చేశారు. దీంతో ఆమె కేకలు వేయడంతో అతడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

అందరూ ఆరోగ్యంగా.. ఆనందంగా ఉండాలి


గుండె పరీక్షలు చేయించుకుంటున్న వ్యక్తితో మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి


వైద్య సేవలందిస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట : ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చూడాలన్న సంకల్పంతోనే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం, దేవ్‌దార్లపల్లె పంచాయతీలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. దేవ్‌దార్లపల్లె పంచాయతీలో మూడు కేంద్రాలుగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. ఇందులో 1,430 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. దేవ్‌దార్లపల్లె పంచాయతీ కార్యాలయం, తెట్టుపల్లె, దేవ్‌దార్లపల్లెలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించారన్నారు. ఒక్కసారి సేకరించిన రక్తంతో 43 రకాల వైద్య పరీక్షలు చేస్తారని వివరించారు. అంతేకాకుండా గుండె పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఎన్ని పనులు ఉన్నా ఒక్క రోజులో పూర్తి స్థాయిలో నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరై ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ ఖుర్షీద్‌బీ, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు గురుశంకర్, మాజీ సర్పంచ్ సాధిక్, మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, పార్టీ నాయకులు షాబాద్, శ్రీధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సిద్ధిక్, సాకిరి భూపాల్, వైద్యాధికారి శశికళ తదితరులు పాల్గొన్నారు.

కరిమాణిక్యుడి తేరు.. భక్త జన హోరు

- వైభవంగా రథోత్సవం
- గోవిందనామ స్మరణలతో మార్మోగిన తుమ్మూరు


స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు(ఇన్‌సెట్) రథంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి

నాయుడుపేటటౌన్: తుమ్మూరులో ఉన్న కరిమాణిక్యస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ, ప్రత్యేక పూజల అనంతరం రథంలో కొలువుతీర్చి, రథోత్సవం నిర్వహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు వేలాది మంది పోటీ పడ్డారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణలతో తుమ్మూరు హోరెత్తింది. భక్తులు రథంపై ఉప్పు మిరియాలు చల్లి, మొక్కులు తీర్చుకున్నారు. పలు కూడళ్లలో దాతలు భక్తులకు మజ్జిగ, రస్న తదితర పానీయాలను పంపిణీ చేశారు. సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తుమ్మూరు ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్వర్యంలో అన్నదానం చేశారు. ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, సహస్రనామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, ఏకాంతసేవ జరిపారు. రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రిస్వామి వారి ఆధ్వర్యంలో స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ శాంతి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఏఈఓ రవికుమార్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్, ఎలక్ట్రికల్ ఏఈ అంజనేయ రాజు, ఆలయ మాజీ ట్రస్టీ కే రామకృష్ణారెడ్డి, కే మోహన్‌రెడ్డి, పీ గంగాప్రసాద్, సురేష్ కుమార్ రెడ్డి, నరసారెడ్డి, మాజీ కౌన్సిలర్ శివరెడ్డి పాల్గొన్నారు.

నేడు పార్వేట ఉత్సవం

కరిమాణిక్యస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పార్వేట ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్ తెలిపారు. ఉదయం తిరుచ్చి ఉత్సవంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా ప్రసన్న వెంకన్న రథోత్సవం


విశేషాలంకరణలో ప్రసన్నవేంకటేశ్వరస్వామి

గూడూరు:పట్టణంలోని రాజావీధిలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. వేకువజామున స్వామి అమ్మవార్లకు విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం చోర సంవాదం, రాత్రి పార్వేట, అశ్వ వాహన సేవ జరిపారు.

వీఆర్వోపై దాడి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): భూ వ్యవహారంలో రెండు వర్గాల మధ్య జరుగుతున్న వివాదంలో ఓ వర్గం ఏకంగా వీఆర్వోపై దాడికి పాల్పడిన ఘటన బాలాయపల్లి మండలం, రామాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేకుంది. బాధిత వీఆర్వో మేకలయ్య కథనం.. రామాపురం గ్రామంలో సర్వే నం.177లో 14 ఎకరాల ప్రభుత్వ భూమి విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ మేరకు గతంలో ఆ భూమిని కాపాడేందుకు రెవెన్యూ అధికారులు ఓ బోర్డును ఏర్పాటు చేశారు. అయినప్పటికీ గ్రామంలో కొందరు నిమ్మచెట్లు నాటేందుకు ప్రయత్నించగా.. వాటిని రెండు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు తొలగించారు. సదరు భూమిని వీఆర్వో మేకలయ్య పరిశీలించేందుకు వెళ్లగా ఆ గ్రామానికి చెందిన ఓ వర్గం మహిళలు, ప్రజలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడిచేశారు. దీనిపై తహసీల్దార్ ఇలా అధికారులపై దాడులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ఈ విషయంపై గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, స్థానిక పోలీసుల ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

12న అప్రెంటీస్ మేళా

శాంతిపురం: మండలంలోని అబకలదొడ్డి ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12వ తేదీన ప్రధాన మంత్రి అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ నగేష్ తెలిపారు. జిల్లాలో కేవలం శాంతిపురం ఐటీఐలో మాత్రమే జరుగుతున్న అప్రెంటీస్ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 8074564049 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.